

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం | 07 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08


# కృష్ణశిలలతో వెయ్యేళ్లు నిలిచేలా

**కాంక్రీట్‌తో కాదు కృష్ణ శిలలతో కట్టాలి**

**రాజన్న ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మించాలి**

**హిట్ జోడీ కాదు.. ఇడుపు కాయితం జోడీ**

**రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే**

**నేరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**రాజన్న సిరిసిల్ల, అక్షిత న్యూస్ :** వేములవాడ రాజన్న గుడిని కాంక్రీట్ తో నిర్మిస్తూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆగమ శాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో వెయ్యేళ్లు నిలిచేలా ఆలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆమె పర్యటించారు. వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆలస్యమైన సరే భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్రం ప్రకారం వేములవాడ రాజన్న గుడిని నిర్మించాలని కోరారు. రాజన్న కోడెలు చనిపోతున్నప్పటికీ పట్టించుకోవటం లేదని వాటికి సరైన పశుగ్రాసం అందించటం లేదన్నారు. కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందిన వేములవాడ ఆలయంలో కోడెలకు ఇలాంటి దయనీయ పరిస్థితి మంచిది కాదని చెప్పారు. కోడెలు చనిపోతే శాస్త్ర ప్రకారం అంత్యక్రియలు కూడా జరిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మాట్లాడితే హిందూత్వ అనే బండి సంజయ్ ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఉండి కూడా ప్రసాద్ స్కీమ్ లో దక్షిణ కాశీగా ప్రశస్తి పొందిన వేములవాడ ఆలయాన్ని చేర్చలేదని.. రాజన్న ఆలయానికి ఆయన ఒక్క రూపాయి కూడా తేలేదని దీనిపై సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నో రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే వేములవాడలో మౌలిక సదుపాయాలు ఏమాత్రం బాగాలేవన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బాగు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. తమ అమ్మనానల పెళ్లి ఇక్కడే జరిగిందని ఈ ప్రాంతంతో తనకు ఎంతో అనుబంధం ఉందని కవిత గుర్తు చేసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సిరిసిల్ల, వేములవాడకు ఎంతో ప్రయోజనం దక్కాలని.. కానీ ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదని చెప్పారు. రుద్రంగిలో 2018లో శంకుస్థాపన చేసిన రిజర్వాయర్ ను పదేళ్లైనా పూర్తి చేయలేదన్నారు. అది పూర్తైతే 63 వేల ఎకరాలకు నీళ్లొస్తాయన్నారు. దూమ్ పేట్ వద్ద రిజర్వాయర్ కట్టి లిఫ్ట్ చేస్తే కథలాపూర్, ..మిగతా 2లో

# జల జగడం!



**ఆయకట్టు కనికట్టు**

**ఏదుల నుంచి డిండికి నీటి తరలింపుపై వివాదం**

**పాలమూరు నీటిపై రాజకీయం ఎందుకు?**

**మహబూబ్‌నగర్, అక్షిత ప్రతినిధి :** జలజగడం మళ్ళీ చిచ్చు రేపింది. ఏదుల జలాశయం నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించాలన్న ప్రతిపాదనపై పాలమూరు లో జలజగడం మొదలైంది. ఏదుల నీరు పాలమూరు సాగు ప్రాంతానిదేనా, డిండి పరిధిలోకి ఎలా వెళ్తుందనే వ్యత్యాసమే ఇప్పుడు వివాదానికి కారణమవుతోంది. పాలమూరు ఆయకట్టును కాపాడాల్సిన నాయకులే మౌనంగా ఉండటంపై రైతులు మండిపడుతున్నారు. నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం, ఆయకట్టు అవసరాలపై స్పష్టమైన సాంకేతిక నివేదిక లేకుండానే తరలింపు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఏదుల నుంచి డిండికి నీటి తరలింపుపై పాలమూరులో తీవ్ర వివాదం చెలరేగింది. పాలమూరు డిండి, డిండి ప్రాజెక్టు మధ్య వ్యత్యాసంపై స్పష్టత లేకుండా నిర్ణయాలు తీసుకుంటే ఆయకట్టు రైతులు ..మిగతా 2లో

# నాణ్యతలో రాజీపడొద్దు

**పెండింగ్ పనులు పూర్తి చేయాలి**

**సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్**



**వికారాబాద్, అక్షిత బ్యూరో :** కళాశాలలో పెండింగ్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు.కొడంగల్ నియోజకవర్గం బొమ్మరాస్ పెట్ మండల పరిధిలో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ ..మిగతా 2లో





# తాగునీరు ఇక నిరంతరం

**మిర్యాలగూడకు 24 గంటల తాగు నీరు**

**అమృత్ 2.0 పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# జల జగడం!

**మొదటి పేజీ తరువాయి...**

నష్టపోతారని రైతులు హెచ్చరిస్తున్నారు. పాలమూరు అంటే నీళ్ల కోసం దశాబ్దాలుగా పోరాడిన నేల. వలసలతో విలవిలలాడిన నేల. ప్రతి చుక్క నీటి కోసం ఉద్యమించిన నేల. అలాంటి పాలమూరుకు నీరు అందించే ప్రాజెక్టుల విషయంలో ఇప్పుడు మరోసారి అనుమానాలు, ఆందోళనలు, రాజకీయ ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏదుల జలాశయం నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించే అంశం ఏ ప్రాతిపదికన ముందుకు వస్తోంది. పాలమూరు సాగునీటి ప్రాంతానికి అవసరమైన నీటి లభ్యతను పూర్తిగా నిర్ధారించారా. వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల కింద ఉన్న సాగు ప్రాంతంపై ప్రభావం ఏమిటి. ఈ నిర్ణయం వెనుక పూర్తి స్థాయి సాంకేతిక అధ్యయనం ఉందా. ఇవన్నీ ఇప్పుడు పాలమూరు రైతుల ముందున్న ప్రశ్నలు.

పాలమూరుకు నీళ్లు వచ్చినట్టే వచ్చి మళ్లీ రాజకీయాల పాలవుతాయా? దశాబ్దాలుగా పాలమూరు ప్రజలు నీటి కోసం కన్నీళ్లు పెట్టుకున్నారు. వేలాది కుటుంబాలు వలసబాట పట్టాయి. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. ఎన్నో హామీలు ఇచ్చాయి.

ఇప్పుడు ప్రాజెక్టులు నిర్మాణ దశలను దాటి సాగు ప్రాంతానికి నీరు అందించే కీలక దశకు వచ్చిన సమయంలో నీటి పంపిణీపై కొత్త వివాదాలు ఎందుకు. రైతుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో స్పష్టత ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకుంటే రేపు నష్టం జరిగితే బాధ్యత ఎవరిది.

**ప్రజా ప్రతినిధులారా మీ గొంతు ఎక్కడ ?**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు ప్రజల ఓట్లతో గెలిచి శాసనసభ, పార్లమెంటుకు వెళ్తున్నారు. అయితే పాలమూరు నీటి హక్కుల విషయంలో వారి గళం ఎంత బలంగా వినిపిస్తోంది.



పాలమూరు రైతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు ప్రశ్నిస్తుంటే ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదు.

పార్టీ జెండాలు పట్టుకోవడానికి రాజకీయ శక్తి ఉంది. ఎన్నికల సమయంలో సభలు పెట్టడానికి సమయం ఉంది. అయితే రైతుల నీటి హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఎందుకు ధైర్యం లేదు. ఇది రాజకీయ శూన్యత కాదా. ఇది బాధ్యతారాహిత్యం కాదా.

**అధికారుల ఒత్తిడిలోనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

నీటిపారుదల ప్రాజెక్టులు రాజకీయ ఆదేశాలతో కాదు. ఇంజనీరింగ్ సూత్రాలు, నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం, సాగు ప్రాంత అవసరాలు, భవిష్యత్ వినియోగం వంటి అంశాల ఆధారంగా నడవాలి.క్షేత్రస్థాయి ఇంజనీర్లు సాంకేతికంగా ఇచ్చే సూచనలకు విలువ లేకపోతే చివరికి నష్టపోయేది అధికారులు కాదు రైతులే. అందుకే ప్రభుత్వం ఒక్క విషయం స్పష్టం చేయాలి. ఏదుల నుంచి డిండికి నీటి తరలింపుపై తీసుకుంటున్న నిర్ణయానికి పూర్తి సాంకేతిక ఆధారం ఏమిటి.

**పాలమూరు మౌనంగా ఉండదు**

ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సాంకేతిక వివరాలను బహిర్గతం చేయకుండా, రాజకీయ ఒత్తిళ్ల మధ్య నిర్ణయాలు తీసుకుంటే పాలమూరు ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. పాలమూరు నీరు ఎవరి రాజకీయ ఆస్తి కాదు. రైతుల నీటి హక్కు ఎవరి దయాదాక్షిణ్యం కాదు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల నీరు ప్రజలకే చెందాలి. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం కాదు. శాస్త్రీయంగా నీటి పంపిణీకి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి**

ఏదుల డిండి నీటి తరలింపుపై పూర్తి సాంకేతిక నివేదికను ప్రజల ముందుంచాలి. పాలమూరు సాగు ప్రాంతానికి ఎలాంటి నష్టం జరగదని స్పష్టమైన హామీ ఇవ్వాలి. స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర పునఃసర్వే నిర్వహించాలి. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటే వాటిని తొలగించాలి. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు పార్టీ భేదాలు పక్కనపెట్టి ఒకే వేదికపైకి వచ్చి పాలమూరు నీటి హక్కులపై ప్రభుత్వాన్ని నిలదీయాలి.

లేకపోతే రేపు చరిత్ర ఒక్కటే ప్రశ్నిస్తుంది. పాలమూరు రైతుల నీటి హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నప్పుడు ప్రజలతో నిలబడాల్సిన నాయకులు ఎక్కడ ఉన్నారు.

## తాగునీరు ఇక నిరంతరం



**మొదటి పేజీ తరువాయి...**

తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేస్తున్న అమృత్ స్కీమ్ 2.0 పనులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్‌ఆర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెద్దదేవులపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ వద్ద అమృత్ 2.0 పథకం కింద నిర్మిస్తున్న నూతన పంప్ హౌస్, నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న 12 నూతన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేసి, పట్టణ ప్రజలకు నిరంతరాయంగా 24 గంటల తాగునీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్‌ఆర్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో తాగునీటి సమస్య గతంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అమృత్ 2.0 పథకం పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు స్వచ్ఛ, నాణ్యమైన, నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమీషనర్ నర్రా శ్రీజారెడ్డి ఇతర అధికారులు, కాంట్రాక్టర్, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## నాణ్యతలో రాజీపడొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

సెక్రటరీ ఎన్. శ్రీధర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు పూర్తి స్థాయిలో నాణ్యతతో చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆయన సూచించారు. కళాశాలలో మౌలిక వసతులు విద్యుత్తుతో పాటు పూర్తి స్థాయిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయన సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. భవనానికి నాణ్యమైన రంగులతో సుందరంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని ఆయన అధికారులకు తెలిపారు. కళాశాల పరిధిలో గుంతలను పూడ్చివేసి చదును చేయాలని ఆయన తెలిపారు.ప్రిన్సిపల్ సెక్రటరీ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ దయానంద్, ఎంపీఓ రవిలు ఉన్నారు.

# కృష్ణశిలలతో వెయ్యేళ్లు నిలిచేలా

**మొదటి పేజీ తరువాయి...**

మేడిపల్లికి నీళ్లు వస్తాయన్నారు. ఎర్రకుంట, పటేళ్ల చెరువును కలిపి అక్కడ రిజర్వాయర్ కడితే వేములవాడ, చందుర్తి, కోనరావు పేట మండలాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లైనా ఇలాంటి పరిస్థితి ఉండటం అన్యాయమన్నారు. మిడ్ మానేర్, అప్పర్ మానేర్ లింక్ పనులను పూర్తి చేయాలని.. అది పూర్తి చేస్తే లక్షా 10 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వవచ్చని చెప్పారు.

**సెస్‌లో అవినీతిపై విచారణ జరపాలి**

సిరిసిల్లలోని సెస్ లో జరిగిన రూ.32 కోట్ల అవినీతిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ అవినీతి జరిగిందని.. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విచారణ జరపటం లేదని ప్రశ్నించారు. సెస్ లో జరిగిన అవినీతి బయట పడకుండా ఉండేందుకు సరిగ్గా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ అగ్నిప్రమాదం జరిగిందని గుర్తు చేశారు. ఆ ప్రమాదంలో ఫైల్స్ అన్ని కాలిపోయాయని చెప్పి చేసిన అవినీతి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. సహకార విద్యుత్ రంగంలో ప్రతిష్టాత్మకమైన సెస్ ను ఎన్పీడీఎల్ లో కలిపి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. నేతన్నలు, చేనేతలు ఎక్కువగా ఉన్న సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయకుండా



అధికార దర్పం ప్రదర్శించేందుకు వేములవాడలో ఏర్పాటు చేశారని విమర్శించారు. రాజకీయాల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టటం మంచిది కాదని సూచించారు. సిరిసిల్లలో మంజూరైన 15 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ ను పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని కోరారు.

రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ లు మాట్లాడితే హిట్ జోడి అంటున్నారని.. కానీ వాళ్లది ఇడుపు కాగితం జోడీ అని ఎద్దేవా చేశారు. మహేష్ కుమార్ గౌడ్ ఒకటి మాట్లాడితే.. రేవంత్ రెడ్డి ఒకటి మాట్లాడుతున్నారని.. హిట్ జోడీ అయితే వేర్వేరుగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమావుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడుక్కోనైనా, కొనుక్కోనైనా ఉచిత కరెంట్ ఇవ్వాలన్నారు. లేదంటే పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. రేవంత్ సర్కార్ అన్ని అంశాల్లోనూ ఫెయిల్ అయ్యిందని ప్రతి దానికీ కమిటీ అంటూ కాలయాపన చేస్తుందన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో వారిని మోసం చేశారని చెప్పారు. ఉర్దూ పేపర్ కు సంబంధించి మండలానికి ఒక్కరికే అక్రిడేషన్ ఇస్తామంటున్నారని.. ముస్లింలు అన్న ఉర్దూ బాష అన్న రేవంత్ రెడ్డికి ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. ముస్లింలకు ఏదో మంచి చేస్తున్నట్లు తన పేరు రేవంతోద్దీన్ అని చెప్పుకుంటున్నారని కానీ ఆయన పేరు అబద్దాలోద్దీన్ అని పెట్టుకోవాలన్నారు.

**న్యాయం చేసే వరకు పోరాడుతాం**

నేరెళ్ల బాధితుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాళ్లను మళ్లీ మోసం చేశారని మండిపడ్డారు. సిరిసిల్ల సభలో వారికి న్యాయం చేస్తారని భావిస్తే రూ. 5, రూ.10 లక్షల చెక్కులిచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. వారిని గ్రూపులుగా విడగొట్టి పరిహారంలో వ్యత్యాసం చూపడం అన్యాయమన్నారు.బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారంతో పాటు మూడు ఎకరాల భూమి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చే పార్టీగా నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రధాన పార్టీలతో సమానంగా తమ పార్టీ ఉద్యమిస్తుందని.. ప్రజల పక్షాన పని చేస్తుందని తెలిపారు.

# ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్సల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పలు వార్డులలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరు, నిర్ణీత సమయంలో అందిస్తున్న మందులు, అల్పాహారం, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఆసుపత్రిని సందర్శించిన సమయంలో లిఫ్ట్ పనిచేయడం లేదని, రోగులు ఇబ్బందులు పడుతున్నారని, తన దృష్టికి రాగా వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.



అంతకుముందు ఆసుపత్రికి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలని తెలిపారు. క్యాంటీన్ లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# సేవా జ్యోతి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

### యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి

### బీజవైఎం ఐటీ సెల్ జిల్లా ఇంచార్జ్ ,సేవ జ్యోతి కార్యక్రమ మండల ఇంచార్జి ఇన్‌చార్జి మచ్చ వివాకర్




**మూటకొండూర్ అక్షిత ప్రతినిధి:** భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్లో భాగంగా అక్టోబర్ 7న నిర్వహించనున్న సేవా జ్యోతి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీజవైఎంహో ఐటీ సెల్ జిల్లా ఇంచార్జ్ ,సేవ జ్యోతి కార్యక్రమ మండల ఇంచార్జి,హో మచ్చ వివాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మూటకొండూర్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి మచ్చ వివాకర్ అధ్యక్షతన ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సేవ, సమర్పణతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, అందులో భాగంగా అక్టోబర్ 7న జరిగే సేవా జ్యోతి బైక్ ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీకి బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, గౌరవ వార్డు సభ్యులు రేగు మల్లేష్, ఆలేటి నాగరాజు, సీనియర్ నాయకులు బాల నరసింహులు, శనిగరం ప్రదీప్, భూమండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'అంగన్ మిలన్ సేవ' - 'అంగన్వాడి ఉత్సవ్'

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అలుగునూర్ -2 అంగన్వాడి కేంద్రంలో 'అంగన్ మిలన్ సేవ' - 'అంగన్వాడి ఉత్సవ్' కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల సమగ్ర అభివృద్ధికి, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం



అందించడంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. చిన్నారుల సంరక్షణలో, అంకితభావంతో సేవలు అందిస్తున్న స్థానిక అంగన్వాడి టీచర్ లతను ఈ వేదికగా ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు చిందం అంజి, అంగన్వాడి సిబ్బంది, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గేర్జం గ్రామాన్ని అభివృద్ధి పరుస్తా

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన యువకులు



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** గేర్జం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అన్ని రకాల మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పరుస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గేర్జం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామస్తులను కలిసి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడా రు. ప్రతీ సమస్యకు పరిష్కారం చూపుతా నాని హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణా నికి త్వరలోనే నిధులు మంజూరు చేసి, పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న సమస్యలను దశల వారీగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ లో చేరికలు..**

గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది యువ కులు పలువురు మహిళలు కలిసి ఎమ్మెల్యే సమక్షం లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. బీఆర్ఎస్ ఎస్ పార్టీపై నమ్మకంతో యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం సంతోషకరమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కలిసి పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ మనోహర్, మాజీ ఉప సర్పంచ్ బలగం రవి, నాయకులు సిద్ధవార్ వెంక మంటేష్, గాద్గె సుభాష్, ముండే పాండు రంగ్, నిర్వాడే రమేష్, సాబేర్, గోవర్ధన్, కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆ బందు ఈ బందు అన్ని బందు



**త్రిపురారం అక్షిత న్యూస్:** నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియా లో స్మార్ట్ రేషన్ కార్డు పంపిని కార్యక్రమం లో శాసనసభ్యులు జై వీర్ రెడ్డీ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆ బందు ఈ బందు అంటూ అన్ని బందు చేసారని పేర్కొన్నారు.సంక్షేమం,అభివృద్ధి రెండు జోడు ఎద్దుల వలె ముందుకు సాగాలి అని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో మిర్యాలగూడ (అర్ డి ఓ )రమణ రెడ్డీ,జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డీ, కాంగ్రెస్ కార్యకర్తలు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ విజేతలకు ఘన సన్మానం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** గాంధీ జయంతి, ఫిట్ ఇండియా సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-15 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ షటిల్ సింగిల్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన కొత్తకోట విద్యార్థులను ఎంబీ చర్చ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కొత్తకోటకు చెందిన జనంపల్లి రేవన్ రాజ్ ప్రథమ బహుమతిగా రూ. 10,000 నగదు, మెమెంటో, కొమ్ము కృపేష్ వర్ధన్ ద్వితీయ బహుమతిగా రూ. 5,000 నగదు, మెమెంటోను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంబీ చర్చ్ యూత్ వారు విజేతలను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ చైర్మన్ ప్రసాద్, ప్రవీణ్, ఆదర్శ్, కొమ్ము అనీల్, జనంపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, విజయదశమి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

**పారిశుద్ధ్య,మంచినీటి, మౌలిక వసతుల కల్పనలో సమస్యలు తలెత్తదు మాజీ మంత్రి ఎమ్మెల్యే కొండా సురేఖ**



**వరంగల్, అక్షిత బ్యూరో:** బతుకమ్మ నవరాత్రులు, విజయదశమి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లపై ఉర్సు రంగలీల మైదానంలో పోలీస్ కమిషనర్ శ్వేత, కలెక్టర్ డాక్టర్ సత్య శారద,గ్రేటర్ కమిషనర్ టి.వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులు సంజయ్ తదితరులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ నవరాత్రుల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

తొమ్మిది రోజుల పాటు మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజూ కార్యక్రమాలు ముగిసిన వెంటనే వ్యర్థాలను తొలగించి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు.

**5-6 వేల మందికి ఏర్పాట్లు**

విజయదశమి సందర్భంగా రాంలీలా మైదానంలో నిర్వహించే రావణ వధ కార్యక్రమానికి సుమారు 5 వేల నుంచి 6 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత రెండేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్యం, అగ్నిమాపక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను కోరారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేతా మాట్లాడుతూ గతం లో నిర్వహించిన బతుకమ్మ ,దసరా ఉత్సవాల ఏర్పాట్లలో ట్రాఫిక్ డైవర్షన్ , ట్రాఫిక్ జామ్ నియాత్రణ ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం ఉత్సవ కమిటీ సహకరిస్తుందని అన్నారు.

ఈ కార్యమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, డియాఠ్వో విజయలక్ష్మి, ఆర్డీవో సుమ సంబంధిత శాఖఅధికారులు, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు

## ట్రాన్స్ జెండర్స్‌కు ఉపాధి అవకాశాలు కల్పిద్దాం

**డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సివిల్ జడ్జి పూజ**




**వరంగల్, అక్షిత బ్యూరో:** ట్రాన్స్ జెండర్స్ అభివృద్ధికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకారం అందించాలని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి కే పూజ అన్నారు.

మంగళవారం సుబేదారిలోని అసంత భవన్ లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మోడరన్ అవేర్నెస్ సొసైటీ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా ట్రాంజెండర్ కమ్యూనిటీకి మానవ అక్రమ రవాణా నిర్మూలన, ట్రాంజెండర్ హక్కుల పరిరక్షణ పైన అవగాహన కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వరంగల్ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే పూజ హాజరై మాట్లాడుతూ సమాజంలో ఇంకా ట్రాంజెండర్ వ్యక్తులపైన వివక్షత కొనసాగుతుందని అంతేగాకుండా ఈ మధ్యకాలంలో నకిలీ ట్రాంజెండర్స్ వలన ట్రాంజెండర్ కమ్యూనిటీకి చెడ్డ పేరు రావడం జరుగుతుందని కాబట్టి నిజమైన ట్రాంజెండర్ వ్యక్తులు ఆ యొక్క నకిలీ ట్రంజెండర్ వ్యక్తులను గుర్తించి సమాజంలో గౌరవంగా ఉండేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కే విశ్వజా, ట్రాంజెండర్ కమ్యూనిటీ నాయకులు లైలా, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్,ఏహెచ్టియు ఎస్సైలు శ్రావణి, సుధాకర్ ,భాగ్యలక్ష్మి, ఇక్బాల్ పాషా, అజయ్ కుమార్,రవి తదితరులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని, ట్రాన్స్ జెండర్ ,గే, శివశక్తి తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాయపర్తి మండల అధ్యక్షుడిగా జక్కుల సందీప్ యాదవ్

**యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తా: సందీప్ యాదవ్**



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాయపర్తి మండల అధ్యక్షుడిగా జక్కుల సందీప్ యాదవ్ నియమితులయ్యారుగతంలో బీజేవైఎం మండల కార్యదర్శిగా పనిచేసిన తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాయపర్తి మండలంలోని ప్రతి గ్రామంలో యువతను బీజేపీలోకి ఆకర్షించేలా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యువతకు చేరువ చేస్తానని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానన్నారు తన నియామకానికి సహకరించిన బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ్ రమేష్, బీజేవైఎం జనగామ జిల్లా అధ్యక్షులు హరీష్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, రాయపర్తి మండల అధ్యక్షులు నూనె అనిల్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రావణ్, రాపాక ప్రశాంత్‌లకు సందీప్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాలకు రక్షణ కవచాలుగా సీసీ కెమెరాలు

**గ్రామ భద్రతకు సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవ...**

**రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాల ఏర్పాటు..**

**పంతంగి గ్రామమంతా నిఘా వలయంలోకి...**

**చౌటుప్పల్ సిఐ మన్మధకుమార్**




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** గ్రామాలకు రక్షణ కవచాలుగా సీసీ కెమెరాలు పనిచేస్తాయని చౌటుప్పల్ సిఐ జీ. మన్మధ కుమార్ అన్నారు. పంతంగి గ్రామంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచే ఉద్దేశంతో సీసీ కెమెరాలను గ్రామ సర్పంచ్ కే.శ్రీలత సుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో చౌటుప్పల్ సిఐ మన్మధకుమార్, ఎస్సై నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించారు.గ్రామానికి చెందిన కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సత్యనారాయణలు రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాలను విరాళంగా అందించడం అభినందనీయమని సిఐ మన్మధకుమార్ పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ మాట్లాడుతూ... గ్రామ భద్రత పరిరక్షణ కోసం శ్రీకాంత్, సత్యనారాయణలు సీసీ కెమెరాలను అందించడం అభినందనీయమన్నారు. గ్రామ భద్రత కోసం ప్రతి ఒక్కరు వారి వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు.గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి కే. పద్మజ, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్‌రెడ్డి, మాధగోని పరమేశ్వరి-శంకర్, అంతటి సౌజన్య-ప్రవీణ్, మాజీ సర్పంచులు చీరిక సంజీవరెడ్డి, అంతటి రమేష్‌గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## రంగలీల మైదానంలో ఎమ్మెల్యే కొండా సురేఖ పర్యటన

**అధికార పార్టీ లో నాయకుల విభేదాలతో ప్రజలకు ఇక్కట్లు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఉర్సు దసరా వేడుకలకు రంగలీల మైదానం వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఉర్సు దసరా ఉత్సవ సమితి పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ మంగళవారం రంగలీల మైదానానికి చేరుకుని వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్‌తో పాటు, వరంగల్ పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, వరంగల్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అయితే ఏర్పాట్ల పరిశీలన సమయంలో కూడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, సంబంధిత అధికారులు అక్కడ కనిపించకపోవడం చర్చకు దారితీసింది.

ఎమ్మెల్యే కొండా సురేఖ, కూడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మధ్య ఉన్న రాజకీయ విభేదాలే ఈ గైర్హాజరుకు కారణమై ఉండొచ్చనే చర్చ స్థానికంగా వినిపిస్తోంది. ఏటా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఉర్సు దసరా వేడుకల ఏర్పాట్ల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈసారి మాత్రం ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడిందనే చర్చలు వినిపిస్తుండటంతో ఉత్సవాల నిర్వహణపై కొందరిలో సందిగ్ధత వ్యక్తమవుతోంది.

రాజకీయ విభేదాలు ఉంటే వాటిని పార్టీ వేదికలపైనే పరిష్కరించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ప్రజలకు ఏడాదికోసారి వచ్చే పండుగను రాజకీయ పంతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని కోరుతున్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**నిజమైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి**

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిజమైన అర్హులకే ప్రభుత్వ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.

మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై



సమీక్షించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికే అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్హతలను నిర్ధారించిన తర్వాతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత సమస్యలను పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు.

మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని అన్నారు. ముఖ్యంగా స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని, అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు సుజాత, ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపునకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం..

**57వ డివిజన్‌లో రూ.2.52 కోట్లతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన..**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 57వ డివిజన్‌లోని సమ్మయ్యనగర్, గోకుల్‌నగర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. డివిజన్‌లో సుమారు రూ.2.52 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అంబేద్కర్ విగ్రహం నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణ కోసం సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రెండు రోజుల్లో టెండర్ ఓపెన్ చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

రోడ్లు, డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, చౌరస్తాల సుందరీకరణ పనులను సమన్వయంతో పూర్తి చేసి 57వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభించడంతో పాటు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

# గ్రామ భద్రతకు సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవ!

**రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాల ఏర్పాటు.. గ్రామమంతా నిఘా వలయంలోకి**

**సీఐ మన్మధకుమార్ చేతుల మీదుగా ప్రారంభం**




**యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో:** గ్రామంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచే ఉద్దేశంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్, ఎస్సై నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించారు. గ్రామానికి చెందిన కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సత్యనారాయణలు రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాలను విరాళంగా అందించడం అభినందనీయమని సీఐ మన్మధకుమార్ పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి కే. పద్మజ, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్‌రెడ్డి, మాధగోని పరమేశ్వరి-శంకర్, అంతటి సౌజన్య-ప్రవీణ్, మాజీ సర్పంచులు చీరిక సంజీవరెడ్డి, అంతటి రమేష్‌గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు

**పరిరక్షణ కోసం చైతన్యం కావాలి**



**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి;** భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని సిద్దిపేట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి లు అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో భారత రాజ్యాంగ పరిరక్షణ చైతన్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రిజర్వేషన్లు రద్దు చేసే ప్రమాదం ఉన్నదన్నారు. ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని పొగడుతుంటే ఇక్కడి పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. జేఏసీ మండల చైర్మన్ డేగల సారయ్య మాట్లాడుతూ హమారా ప్రసాద్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలతో కూడిన పుస్తకాన్ని రాయడం హేయమైన చర్య అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానం భారతదేశానికి తప్పనిసరి అనే భావన అందరి కలిగి ఉండాలన్నారు. ఇంటింటికి రాజ్యాంగ ఆవశ్యకత ప్రచారం జరగాలన్నారు. భారత రాజ్యాంగ ఆవశ్యకతను తెలపడంలో హుస్నాబాద్ నియోజకవర్గం భారత దేశంలోనే గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెప్పియాల ప్రకాష్, కండే సుధాకర్, రేణికుంట్ల బిక్షపతి, ఉప్పుల కుమారస్వామి, మేకల వీరన్న, ఇల్లందుల లక్ష్మణ్, మండల సురేందర్ ,వేముల జగదీష్, బొల్లంపల్లి ప్రకాష్, ఆదరి రవీందర్ తోందూరి ఎల్లయ్య, ముక్కెర సంపత్, హెల్తూరి ప్రేమ్ రాజ్ ,గాదపాక రవీందర్, కండే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఏ అధ్యక్షుడిని కలిసిన ఎంపిజే జిల్లా బృందం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజే) ఖమ్మం జిల్లా బృందం సభ్యులు ఖమ్మంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి హరిప్రసాద్ ను మర్యాదపూర్వకంగా ప్రసూన ఆర్థోపెడిక్ హాస్పిటల్ లో కలిశారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.సమాజంలో శాంతి న్యాయం సామాజిక బాధ్యతలకు సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజా సంక్షేమం కోసం వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంపై వారు అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు ఎస్కె ఖాసిం జనరల్ సెక్రటరీ ఎస్డి నాసర్ అహ్మద్ ట్రెజరర్ ఎండి హకీమ్ కార్యదర్శులు ఎండి రాజబాలి ఎస్డి. రఫీక్ సభ్యులు ఎస్కె షరీఫ్ ఎండి బియాబాని తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం వన్ టౌన్ రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ఓ లుగా బాధ్యతలు స్వీకరించిన సిఐ లు



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం వన్ టౌన్ ఎస్ హెచ్ఓ గా ఎండి సాధిక్ పాషా రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా టి.కరుణాకర్ నూతన బాధ్యతలు స్వీకరించారు. ఇన్స్పెక్టర్లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## మాజీ ఉప రాష్ట్రపతి అభినందనలు పొందిన చిత్రకారుడు పిచ్చయ్య



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఒంగోలు పట్టణ 150 వసంతాల ప్రస్తానం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో జరిగిన చిత్రలేఖన పోటీలలో సత్తుపల్లి ప్రాంత ప్రముఖ చిత్రకారుడు పల్లం పిచ్చయ్యద్వితీయబహుమతిగా పదివేలరూపాయలు అందుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చయ్యను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందనలు అందచేశారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ పోటీలో ఒంగోలు ప్రాంతానికి చెందినప్రముఖవ్యక్తులు,కట్టడాలు,వారసత్వ సంపద,సంస్కృతి, వివిధ సంఘటనలు ఇతి వృత్తాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో చిత్రలేఖన పోటీలను ఇటివలనిర్వహించారు.వీటన్నిటి సమ్మేళనంగా పిచ్చయ్య గీసిన చిత్రం ద్వితీయ బహుమతి సాధించి వెంకయ్య నాయుడు ప్రత్యేక ప్రశంశలు పొందింది.సోమవారంఒంగోలులో జరిగిన కార్యక్రమంలో పిచ్చయ్య బహుమతి స్వీకరించారు. ఈ సందర్భంగా పిచ్చయ్యను సృజన సాహితీ సమాఖ్య అభినందనలు తెలిపింది.

## భూములకు సంబంధించి వివాదాలు, సమస్యలకు

# భూ రీసర్వే పరిష్కార మార్గం

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** భూములకు సంబంధించిన వివాదాలు, ఇతర సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపేందుకు భూముల రీసర్వే ప్రక్రియ దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండల పరిధిలోని బూడిదపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తయిన సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులతో, రైతులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో రీసర్వే ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసుకున్న తొలి గ్రామంగా బూడిదపాడు నిలిచిందని తెలిపారు. రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన గ్రామ రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక జీపీఎస్ పరికరాల ద్వారా గ్రామంలో రీసర్వే నిర్వహించినట్లు చెప్పారు. గతంలో సుమారు 125 సంవత్సరాల క్రితం నిజాం కాలంలో భూముల సర్వే జరిగిందని, ఇంత సుదీర్ఘ కాలం తర్వాత ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో భవిష్యత్తులో భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. రీసర్వే వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సంబంధిత భూ యజమానులకు నోటీసులు కూడా అందజేస్తామని చెప్పారు. రీసర్వేలో భూమి విస్తీర్ణంలో కొంతమేర ఎక్కువ లేదా తక్కువగా నమోదైన సందర్భాల్లో రైతులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని, ఇందుకోసం 60 రోజుల గడువు ఉంటుందని కలెక్టర్ వివరించారు. రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో భూములను విక్రయించే వారికి, కొనుగోలు చేసే వారికి భూమి వివరాలపై మరింత ప్రామాణికత, స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓ ఇందిరమ్మ ఇంటిని సందర్శించారు. ఇంటి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణానికి అయిన వ్యయం, ఇంటిని ఏ విధంగా నిర్మించుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులను కలెక్టర్ అభినందించారు.

**పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి**

అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయపాలనతో హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి అర్థం చేసుకునే విధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సర్వే శాఖ ఏడి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ విటోబా, ఇతర మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

### మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగర అభివృద్ధి, సంక్షేమానికి తమ పాలకవర్గం పెద్దపీట వేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం 47 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పోరేటర్ గాజ రమ శివరాం తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం కు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్ లో ఉన్న పెండింగ్ సమస్యలు తనిఖీ చేసి పరిశీలించారు. స్థానిక ప్రజలను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలను మేయర్ దృష్టికి తేవడంతో స్పందించిన మేయర్ త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ నగరపాలక సంస్థ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మా పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి సలహా సూచనలతో నగర ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో పెద్ద పీట వేశామని తెలిపారు. బండి సంజయ్ కుమార్ సూచన మేరకు నగరంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించామో... అంతకు రెట్టింపుగా ఆడబిడ్డల సంస్కృతి, సాంప్రదాయమైన బదుకమ్మ వేడుకలు, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు కన్నుల పండగలా సాగే బతుకమ్మ వేడుకలకు 66 డివిజన్లలో బతుకమ్మ పాయింట్లతో పాటు చివరి రోజు నిమజ్జనం పాయింట్ల వద్ద కూడ భారీ ఏర్పట్లు చేసి అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా 47 వ డివిజన్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ ఎంజిఎఫ్ నిధుల నుండి గతం 20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అంతే కాకుండా 15 ఫైనాన్స్ నిధుల నుండి 25 లక్షల నిధులతో డివిజన్ లో త్వరలోనే మంచి నీటి పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టి మూడు కాలనీల్లో ప్రజల త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసి టెండర్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. త్వరలోనే యూసిఎఫ్ నిధులతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి నగరాన్ని సుంధర నగరంగా మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గుప్పెడు మందితో మొదలై

### లక్షలాది భక్తుల కొంగు బంగారమై

### విరాజిల్లుతున్న కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం

### ఈనెల 11 నుండి 20 వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యవేక్షణలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు షురూ



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య చేతుల మీదుగా సరిగ్గా 16 ఏళ్ల క్రితం అంటే 2010 జూన్ 17న ప్రతిష్టించిన మహా పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం. గుప్పెడు మందితో మొదలైన అమ్మవారి ఆలయం నేడు లక్షలాది మంది భక్తుల విశ్వాస క్షేత్రంగా విరాజిల్లుతోంది. 16 ఏళ్ల క్రితం బండి సంజయ్ కుమార్ సంకల్ప బలంతో కొలువైన ఈ దేవాలయం దినదిన ప్రవర్ధమానమై వెలుగొందుతూ జిల్లా ఎల్లలు దాటి ఇతర రాష్ట్రాలకు, దేశ సరిహద్దులను దాటి వివిధ భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కష్టాల్లో ఉన్నవారికి కొండంత అండగా దీక్ష తీసుకున్న వారికి ధైర్యంగా భక్తులకు ఆత్మీయ తల్లిగా మహాశక్తి అమ్మవారిని భక్తులు కొలుస్తున్నారు. "అమ్మ దగ్గరకు వచ్చాను అంతా అమ్మ చూసుకుంటుంది." అనే విశ్వాసం భక్తుల హృదయాల్లో నిలిచింది. ఈ పుణ్య క్షేత్రం ఏడాది పొడువునా ప్రత్యేక పూజలందుకుంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అలరారుతూనే ఉంది. ఇక దసరా నవరాత్రులు ఇక్కడ హైలైట్ గా నిలిచాయి. విజయవాడ దుర్గమ్మ ఆలయ ఉత్సవాలను తలపించేలా దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఈ ఆలయ ప్రత్యేకత.

**""బండి పర్యవేక్షణలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు షురూ"""**

ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుడికి కేవలం దర్శనం మాత్రమే కాదు భక్తి అనుభూతి సేవా స్పర్శ సంప్రదాయ వైభవం కుటుంబ ఆత్మీయతను అందించే ఆధ్యాత్మిక క్షేత్రంగా మహాశక్తి దేవాలయం తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. మరో మూడు రోజుల్లో ఈ మహిమాన్విత క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు ఆరంభం కాబోతోండటంతో భక్తులందరి దృష్టి ఈ క్షేత్రంపైనే ఉంటుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యవేక్షణలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి.






**""భవానీ దీక్షాపరులతో కిటకిటలాడనున్న మహాక్షేత్రం"""**

శ్రీమహాశక్తి ఆలయం ప్రతిష్టించిన తొలిరోజుల్లో బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులతోపాలు గుప్పెడు మంది మాత్రమే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భవానీ మాలాధారణ గావించి దీక్ష తీసుకునే వారు. ఈ 16 ఏళ్లలో ఊహించని రీతిలో భవానీ దీక్షాపరుల సంఖ్య ఎక్కువైంది. వేలాది మంది భవానీ దీక్ష తీసుకుని అమ్మవారి సేవలో తరిస్తున్నారు. గత రెండేళ్లలో దుర్గామాల వేసుకునే యువకుల సంఖ్య రెట్టింపైంది. అమ్మవారికి ఇష్టమైన ఎరుపు రంగు వస్త్రాలతో దీక్ష ధరించి అమ్మవారిని కొలుస్తున్నారు. దుర్గామాత దీక్షాపరులతో ఈ పుణ్యక్షేత్రం దసరా నవరాత్రి ఉత్సవాల్లో సందడిగా మారబోతోంది. 108 రోజుల దీక్ష, మండల దీక్ష, నవరాత్రి దీక్ష, ఎన్ని రోజులు దీక్ష చేసినా లక్ష్యం ఒక్కటే "అమ్మవారి ఆశీస్సులు పొందాలి అమ్మను నమ్ముకుని ముందుకు సాగాలి." అన్నదే భక్తుల సంకల్పంగా మారింది.

**""అమ్మ దర్శనమే కాదు అన్న ప్రసాదం హైలైట్.**

అన్నదానం""" ఇక్కడ ఒక సేవ కాదు, ఒక సంప్రదాయం. మహాశక్తి సన్నిధిలో అన్నదానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ శ్రీ మహాశక్తి ఆలయానికి వచ్చే భక్తులందరికీ ప్రతినెల సంకట హర చతుర్థి రోజున షడ్రుచులతో రుచికరమైన అన్నప్రసాదాలు వడ్డిస్తున్నారు. ఆరోజు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని భుజిస్తుంటారు. దసరా నవరాత్రి ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఇక్కడ అమ్మవారిని దర్శించుకునే వేలాది మందికి రుచికరమైన భోజనం వడ్డిస్తారు. ఎంతమంది వచ్చినా సరే చిట్ట చివరి వరుసలో కూర్చున్న ఆఖరి భక్తుడికి సైతం లేదనకుండా ఆప్యాయతతో భోజనం వడ్డించడం ఇక్కడి ప్రత్యేకత. చిట్టచివరి వరుసలో కూర్చున్న భక్తుడి వరకు అదే శ్రద్ధ అదే రుచి అదే ఆత్మీయత లభిస్తోంది. భక్తుడు అమ్మవారిని దర్శించుకుని బయటకు వెళ్లేటప్పుడు "అమ్మను చూశాం" అనే అనుభూతితో పాటు "అమ్మ ప్రసాదం తిన్నాం" అనే తృప్తితో వెళ్లేలా అన్నదానాన్ని నిర్వహిస్తుండటం ఇక్కడి విశేషం.

**""10 రోజులు 10 పది ఆధ్యాత్మిక అనుభూతులు"""**

ఈనెల 11 నుండి 20 వరకు అంటే పదిరోజుల పాటు మహాశక్తి ఆలయంలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు రోజుకో ప్రత్యేకతను సంతరించుకోనుంది. బాలాత్రిపురసుందరి నుంచి గాయత్రీదేవి వరకు, అన్నపూర్ణ నుంచి మహిషాసురమర్దిని వరకు, లలితాదేవి నుంచి మహాలక్ష్మి వరకు, దుర్గాదేవి నుంచి రాజరాజేశ్వరి వరకు, అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 108 రకాల నైవేద్యం... చండీ పారాయణం, లక్ష్మీ పూజ, సహస్రనామ పారాయణం, చండీ హోమం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఇవన్నీ కలసి కరీంనగర్‌లో నవరాత్రి వైభవానికి కొత్త శోభను తీసుకురానున్నాయి.

**""భక్తులారా తరలిరండి"""**

అక్టోబర్ 11 నుంచి 20 వరకు కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు భక్తులందరూ భారీ ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో పాలు పంచుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపినిచ్చారు. "ఇది కేవలం నవరాత్రి ఉత్సవాలు కాదు. అమ్మను ఆరాధించే పది రోజుల పర్వదినం. భక్తిని అనుభవించే పది రోజుల ఆధ్యాత్మిక ప్రయాణం. మహాశక్తి తల్లిని అక్కున చేర్చుకునే పది రోజుల మహోత్సవం. "అమ్మ దగ్గరకు రండి అమ్మ ఆశీస్సులు తీసుకెళ్లండి." అని కోరారు.

## పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువయ్యేలా నగరపాలక సంస్థ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మాణం చేస్తుందని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ విస్తృతంగా పర్యటించారు. నగరంలోని కట్టారాంపూర్, సప్తగిరి కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను స్వయంగా తనిఖీ చేసి



పరిశీలించారు. ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో కలిసి భవన నిర్మాణ పురోగతి పనుల పై ఆరా తీశారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిపారు. యూపీహెచ్‌సీల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, హెల్త్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచగుడిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...



**లోకేశ్వరం,అక్టోబర్ 6 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల పరిధిలోని పంచగుడి గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మామిడి మమత భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వై. గంగాధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ గైని రాజన్న, రేషన్ డీలర్ జమదండి భూమన్న పటేల్, గ్రామ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం, దామెర, తాళ్ల సింగారం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జయంతి కుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండో వార్డ్ కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి, దామెర ఉప సర్పంచ్ ఉప్పనూతల నరసింహ ల చేతుల మీదుగా అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివిస్ పరిశ్రమ విద్యా సంస్థలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతులమీదుగా విద్యార్థులకు ఉచితంగా 32,496 రూపాయల విలువ గల రాత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే విజయ్ కుమారి, కె ప్రసన్న రాణి , ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది, విద్యార్థులు, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు బి గోపి, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గుడిపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కిషన్‌కుమార్



**గుడిపల్లి, అక్షిత ప్రతినిధి:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తెలంగాణ గుడిపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కోదండపురం గ్రామానికి చెందిన మెరుగు కిషన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా అధ్యక్షుడు పోతం సహదేవుడు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, మండల అధ్యక్షుడు ఎర్ర వంశీకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మారేపల్లి వెంకటయ్య, సీనియర్ నాయకులు మైనం కొండల్, బుర్రి నాగయ్య, పోత సైదులు, శేషగిరి,బుర్రి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు కలిసి పని చేయాలి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

### ఎమ్మెల్యే సొంత మండలంలో కాంగ్రెస్ పార్టీకి షాక్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** బిఆరెస్ పార్టీ పటిష్టతకు అందరితో కలిసి అని చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని స్కూలు తండా గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మోసపురిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. పాత కొత్త అనే బేదాభిప్రాయాలు లేకుండా అందరు కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చెయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత అధ్యక్షులు యం.రాకేష్, యం.శ్రీను, యం. లచ్చ, ఎం.రమేష్, ఎం. ఛతురు, ఎం. నారమ్మ, ఎం.ముత్యాలమ్మ,నిజామా, నరేష్ తదితరులు ఉన్నారు.

## శ్రీ శ్రీ రేణుక రేణుక ఎల్లమ్మ తల్లినీ దర్శించుకున్న దర్గా కాజిపేట్ పాక్స్ చైర్మన్, డైరెక్టర్లు, జిడబ్ల్యూఎంసి 62 వ డివిజన్ ప్రెసిడెంట్...



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** ఇటీవలే నూతనంగా ఎంపికైన దర్గా కాజీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి సభ్యులు బుర్ర బాబురావు, దోమ రాగ సుధా రెడ్డి,గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ 62 వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు మంగళవారం సోమిడి శివారులోని శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం నందు సోమిడి గౌడ సంఘం , ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లికొండ యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి శ్రీ శ్రీ రేణుక రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదం పొందారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లికొండ యాదగిరిగౌడ్ వారికి సాదర ఆహ్వానం పలికి ఆలయ బ్రాహ్మణులచే ఆశీర్వాదం ఇప్పించారు.

## వేపూరు గ్రామంలో భూభారతి భూ సర్వే కార్యక్రమం

### గ్రామ సర్పంచ్ నాగరాజ్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** భూభారతి భూ సర్వే కార్యక్రమం కల్వకుర్తి మండల పరిధిలోని వేపూరు గ్రామంలో మంగళవారం హనుమద్దాస్ టెంపుల్ దగ్గర భూభారతి భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజ్ , ఉపసర్పంచ్ రాసమల్ల కృష్ణయ్య , గ్రామ కార్యదర్శి మునహర చారి, రెవెన్యూ ఆర్ఐ, జిపిఓ విష్ణు, సర్వేయర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మట్టి పరీక్షా కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

### పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

### మట్టి పరీక్షా కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన మట్టి పరీక్షా కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు.



ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్.. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటుపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు.

మట్టి పరీక్షా కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులకు అవసరమైన నిధులను త్వరగా విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. భవనంలో అవసరమైన మరమ్మతులను గుర్తించి, వాటికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు.

అందుబాటులో ఉన్న స్థలాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ మట్టి పరీక్షా కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి, మట్టి పరీక్షా కేంద్రాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకి పెన్షన్లను మంజూరు చేసి,కరంట్ కోతలు నివారించాలని ప్రదర్శన ధర్నా

### సత్తుపల్లి సిపిఐ ఎం మాస్ లైన్




**సత్తుపల్లి , అక్షిత న్యూస్:** జిల్లాలో విద్యుత్ కోతలు పెరగటానికి, నిత్యాసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడానికి, వేయి రోజుల పరిపాలనలో అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వలేకపోవడానికి, కేంద్ర ప్రభుత్వ నూతన విద్యుత్ సవరణ చట్టం పేరుతో విద్యుత్ మీటర్లు బిగించడం లాంటి సమస్యల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. మంగళవారం నీలం రామచంద్రయ్య భవనం నుంచి కాకర్లపల్లి రోడ్ నుంచి పాత సెంటర్ కల్పతర్ రోడ్ రింగ్ సెంటర్ మీదిగా ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాచేసి వినతి పత్రం ఇవ్వటం జరిగింది . ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా విద్యుత్ కోతలు పెరగటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు కోతల వలన నీరు లేక రైతాంగం వేసిన పంటలు ఎండిపోతున్నాయని, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారానికి రావడానికి ముందు ఓట్ల కోసం ప్రజలకు 420 వాగ్దానాలు చేశారని, పెన్షన్లు ఇవ్వడంలో విఫలమైనారని, అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తలసేమియా బాధితులు, అనాథలందరికి పెన్షన్లు ఇస్తానని సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు నేడు ఆకాశాన్ని అంటే విధంగా పెంచడం వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమకు వచ్చే అల్పాదాయంతో కొనలేని అర్ధాకలి తో జీవించాల్సిన స్థితి దా పురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టంలో భాగంగా వినియోగదారుల ఇండ్లకు మీటర్లు బిగించే విధానం వలన అధికంగా చార్జీల భారం మోపి,బలవంతంగా వసూలు చేసే చర్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవటం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపడం, ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం చేస్తూ పోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య, జిల్లా నాయకులు గంట శ్రీనివాస్, బిరెల్లి లాజర్, అమర్లపూడి శరత్, డివిజన్ నాయకులు రాజువేంకటేష్,నాగిరెడ్డి,పుల్లారావు,మ్యాలాద్రి రాజారావు,నాగ ప్రసాద్, దేవి అలివేలు, వెంకటమ్మ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

## హోటళ్లపై ఫుడ్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ అధికారుల ఆకస్మిక దాడులు 'సోమేశ్వర' హోటల్ సీజ్!



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్లు ఉమ్మడిగా పలు హోటళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్థానిక ప్రజల నుండి అందిన ఫిర్యాదులు, విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు.

ఈ దాడుల్లో భాగంగా పట్టణంలోని ప్రముఖ 'సోమేశ్వర హోటల్'ను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు హోటల్‌లో కనీస పరిశుభ్రత పాటించడం లేదని, వంటగది పరిసరాలు అత్యంత అపరిశుభ్రంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హోటల్ యాజమాన్యంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతేకాకుండా, సదరు సోమేశ్వర హోటల్‌కు మున్సిపాలిటీ నుండి ఎలాంటి అధికారిక అనుమతులు (పర్మిషన్లు) లేవని తనిఖీల్లో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నడుపుతుండటం, పరిశుభ్రత లోపించడంతో అధికారులు ఆ హోటల్‌ను తక్షణమే సీజ్ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే ఏ హోటల్ లేదా తినుబండారాల నిర్వాహకులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి హోటల్ ఖచ్చితంగా మున్సిపల్ అనుమతులు కలిగి ఉండాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు పాల్గొన్నారు.